క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశాంతిహిల్స్, రాయదుర్గం పీఎస్, రాయదుర్గం, మధురానగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్లో.. టమాట 20, పచ్చిమిర్చి 40– 50, బెండ 50, కాకర 50, దొండ 45, దోస 60, ఆలు 20, చామ 80, కీర 25, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 25, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 25, చిక్కుడు 65, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3)10 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 90.

నేడు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

హఫీజ్‌పేట్: మదీనాగూడ దీప్తిశ్రీనగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని జగద్రక్షక శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి జన్మ నక్షత్ర (ఉత్తర ఫల్గుణీ నక్షత్ర) పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటలకు గణపతి హోమం, 6.15 గంటలకు నలుగు స్నానం, పంచామృత అభిషేకం, అష్టద్రవ్య అభిషేకం, చందనపు కాపు, మధ్యాహ్నం 12.30 గంటలకు హారతి, తీర్థ ప్రసాదములు, 1 గంటకు శ్రీ వెంకటేశ్వర సేవాసమితి చందానగర్ వారిచే అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రసాదరావు గురుస్వామిచే ఏకశిలా పదునెట్టాంబడికి పూజ నిర్వహిస్తారని తెలిపారు.

జీవన నైపుణ్యాలపై గెస్ట్ లెక్చర్



మాట్లాడుతున్న సుబ్బారావు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'లైఫ్ స్కిల్స్–క్యాంపస్ టు కెరీర్ ట్రాన్సిషన్' అనే అంశంపై మంగళవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. నైపుణ్య సంస్కృతి వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు మాట్లాడుతూ..... విజయవంతమైన ప్రయాణంలో సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యత, జీవితం ప్రాథమిక ఉద్దేశం వంటి వాటిని వివరించారు. విజయాన్ని చేరుకోవడానికి గ్రోత్ ఎనేబుల్స్ అవసరాన్ని కూడా ఆయన వివరించారు. అనంతరం విద్యార్థులు సంధించిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివ కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాది తాండ్ర రమేష్‌కు సన్మానం



మియాపూర్: మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ సమితి ఆధ్వర్యంలో మంగళవారం కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ,సీనియర్ న్యాయవాది తాండ్ర రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి రమేష్ , సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుకన్య, గ్రేటర్ కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్‌నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చాలి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం భెల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌లకు హైదరాబాద్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో భెల్ కార్మిక సంఘం అధ్యక్షుడు మహేష్, ప్రధానకార్యదర్శి రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ పరిశ్రమలో ఎగ్జిక్యూటివ్‌లు, సూపర్‌వైజర్లు, కార్మికులు కలసి మూడు వేల మంది వరకు ఉన్నారన్నారు. వారి సొంత ఇంటి కలను నిజం చేయాడానికి స్థలం మంజూరు చేసేందుకు సహకరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం, నాయకులు చంద్రమోహన్, సుభాన్‌గౌడ్, రమేశ్, చాడేశ్, విజయ్, అశోక్, బాలకృష్ణ, అఖిల్‌లు పాల్గొన్నారు.

నల్లగండ్ల హుడా అవుట్‌లెట్ సమస్యను పరిష్కరిస్తా



శేరిలింగంపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గాంధీ

ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీ అవుట్‌లెట్ సమస్యను త్వరలో పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. మంగళవారం నల్లగండ్ల హుడా కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, నల్లగండ్ల విలేజ్‌లలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబ, నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావుతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నల్లగండ్ల విలేజ్, శ్రీకృష్ణ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, జలమండలి అధికారులు అభిషేక్, బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, భరత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్, ఆదర్శనగర్, తారానగర్, లింగంపల్లి విలేజ్‌లలో ఎమ్మెల్యే గాంధీ కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆరంభ టౌన్‌షిప్ వెనుక భాగంలో ఉన్న నాలాపై కల్వర్టు నిర్మాణ విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లింగంపల్లి విలేజ్, తారానగర్‌లలో యూజీడీ, సీసీ రోడ్డు పనుల్లో అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, బీఆర్ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశంగౌడ్, నాయకులు రవీందర్ గౌడ్, యాదాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ట్రిపుల్‌ఐటీ హెచ్



ఐసీపీసీ పోటీలో ఫైనల్‌కు చేరిన విద్యార్థులు

రాయదుర్గం: ఇంటర్నేషనల్ కాలేజియేట్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్(ఐసీపీసీ) పోటీలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ప్రపంచంలోని అత్యంత పురాతన, ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలో 111 దేశాలకు చెందిన 3వేల యూనివర్సిటీలకు చెందిన 50వేల మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థులతో కూడిన ట్రిపుల్‌ఐటీ టీమ్ సత్తా చాటి ఫైనల్‌కు చేరుకుంది. ఐసీపీసీ సాధారణ కోడింగ్ పోటీకాదు. ఇది మానసికంగా గొప్ప క్రీడా ఈవెంట్, ఇక్కడ పరిష్కరించబడిన అల్గారిథమిక్ ప్రోగ్రామింగ్ సమస్యల వేగం, సంఖ్య ఆధారంగా జట్లను అంచనా వేస్తారు. ప్రోగ్రామర్లు కోడ్‌ను ఏకాంతంగా పగులగొట్టే అపోహలను ఇది తొలగించినందున జట్టు ప్రయత్నం ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తోంది. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ విద్యార్థులు 2012 నుంచి ఐసీపీసీలో చురుగ్గా పాల్గొంటున్నారు. మొత్తం 14సార్లు పాల్గొనగా, 12 సార్లు ఫైనలిస్టులుగా అర్హత సాధించారు. ఈసారి పోటీల్లో అమూల్ అగర్వాల్, అలసస్ చౌదరి, ఆదిత్యవర్మలతో కూడిన బృందం పాల్గొంది. 250కి పైగా కళాశాలల నుంచి దాదాపు 1,500 జట్లను ఓడించింది. ఇందులో అగ్రశ్రేణి ఐఐటీలు, ఎన్ఐటీలు, బిట్స్ నుంచి అత్యుత్తమ భారతీయ జట్లే కాకుండా కొన్ని అత్యుత్తమ అంతర్జాతీయ జట్లు కూడా ఉన్నాయి.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలి

గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి బీజేపీ శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లతో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: బీజేపీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు. బూత్ స్వశక్తికరణ్ అభియాన్‌లో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డి, నానక్‌రాంగూడలోని శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, స్వల్పకాలిక విస్తారకుల సమావేశంలో ఆయన సోమవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని బీజేపీ గెలుపు బాధ్యతను అందరూ తీసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ అనూహ్య ఫలితాలు సాధిస్తోందని, రానున్న ఎన్నికలలో కూడా బీజేపీ జెండాను శేరిలింగంపల్లిలో ఎగిరేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, బీజేపీ సీనియర్ నాయకులు హన్మంతునాయక్, వరలక్ష్మీ, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతి, కిషన్, శివసింగ్, హరీష్‌శంకర్‌యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ స్కూల్ ప్రారంభం



పాఠశాల ప్రారంభోత్సవంలో డా. సతీష్‌కుమార్, పాఠశాల ప్రతినిధులు

గచ్చిబౌలి: ర్యాన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ నగరంలో తొలి పాఠశాలను ప్రారంభించింది. 2023–24 విద్యాసంవత్సరంలో కొండాపూర్‌లో ఏప్రిల్ మొదటి వారంలో పాఠశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇనిస్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రేస్ పింటో, కల్వరి టెంపుల్ నిర్వాహకులు డాక్టర్ పి సతీష్‌కుమార్, స్కూల్స్ గ్రూప్ సీఈఓ రియాన్ పింటో సమక్షంలో ప్రారంభ వేడుకను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రియాన్ పింటో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శారదకు జాతీయ అవార్డు

జిన్నారం(పటాన్‌చెరు): అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీ వారు జిన్నారం మండలంలోని బొల్లారానికి చెందిన శారద సావిత్రీబాయి పూలే జాతీయస్థాయి అవార్డు అందజేశారు. ఈ అవార్డును మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో శారదకు నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ ప్రజలకు చేసిన సేవలను గుర్తించి తనకు అవార్డును అందించటం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. జాతీయ స్థాయి అవార్డులను అందిస్తూ ప్రోత్సహిస్తున్న సాహిత్య అకాడమీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశ్నపత్రాల లీకేజీలకు ముగింపు లేదా?



మాట్లాడుతున్న గడీల శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: ప్రశ్నపత్రాల లీకేజీలకు ముగింపుఎన్నడని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ ప్రశ్నించారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పది ప్రశ్నపత్రాల లీకేజీలు జరుగుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఏడాది పొడవునా ఎంతో శ్రమించి పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్న పదో తరగతి విద్యార్థులకు ఎందుకు ఇంత అన్యాయం, ఎవరి సొంత లాభం కోసం మీ ప్రభుత్వం తపిస్తున్నట్టు చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు మధుకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, పటాన్‌చెరు అసెంబ్లీ బీజేవైఎం కన్వీనర్ రాజ్ గోపాల్‌యాదవ్, సంగమేష్ రఘురాం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతా

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్, సుమిత్రనగర్, బాగ్అమీర్ కాలనీల్లో రూ.81.23 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు, యుజీడీ నిర్మాణ పనులకు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. అదే విధంగా వివేకానందనగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని చెప్పారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ గోవర్ధన్, ఈఈ ఆశ, జలమండలి అధికారులు డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, సంజీవరెడ్డి, పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్‌రావు, రాంచందర్, ఆంజనేయులు,మహేష్, శ్రావణిరెడ్డి, విద్యాసాగర్, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

5శాతం రాయితీతో పన్నులు చెల్లించవచ్చు

నిజాంపేట్: సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని నిజాంపేట్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ రామకృష్ణ అన్నారు. ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 30తో ముగియనున్న నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని ఇళ్ల యజమానులు 5శాతం రాయితీతో పన్నులు చెల్లించే అవకాశం కల్పించామని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్తి పన్ను లక్ష ఉన్నట్లయితే 95 వేలు చెల్లిస్తే సరిపోతుందని, ఎంత ఆస్తి పన్ను ఉన్నా ఏప్రిల్ 30వ తేది లోపు చెల్లిస్తే 5శాతం రిబేటు ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం



మేయర్ నీలారెడ్డికి ఆర్గానిక్ బహుమతులు ఇస్తున్న హిల్‌కౌంటీ మహిళలు

నిజాంపేట్: స్వచ్ఛతకు కేరాఫ్ అడ్రస్‌గా నిజాంపేట్ కార్పొరేషన్‌ను తీర్చిదిద్దుతున్నామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం నిజాంపేట్ హిల్‌కౌంటీ కాలనీ మహిళలు మంజుల, శైలజ, ఐషా, సాధనలు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హిల్‌కౌంటీ కాలనీలో వ్యర్థాల విభజన ప్రక్రియ ప్రారంభమై సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో మేయర్‌కు ఆర్గానిక్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కాలనీలు, బస్తీల ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని కోరారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్‌దే

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఇక్రిశాట్ కాలనీ, సురక్ష ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.50లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, వేమన వీకర్ సెక్షన్ కాలనీలో రూ.25లక్షలతో తాగునీటి పైపులైన్ పనులకు కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రిజర్వాయర్లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేనన్ని అభివృద్ధి పనులు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.8500కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ సునీత, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జిన్నారం(పటాన్‌చెరు): ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించటంతో పాటు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆస్పత్రి వైద్యురాలు రాధిక ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గుండెపోటు వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రోజారాణి మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగాహన కల్గి ఉంటే గుండెపోటు మరణాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రగతిపథంలో పల్లెలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి పల్లెను ప్రగతి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి, ఇస్నాపూర్ చిట్కుల్, రుద్రారం, లక్డారం, ఘనాపూర్, పాటి, కర్ధనూర్, నందిగామ గ్రామాల్లో రూ.5 కోట్ల 8 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం నూతన రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి పథకం గ్రామాల రూపురేఖలను మార్చిందని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, వీధి దీపాలు, నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, ట్రాక్టర్లు అందించినట్లు చెప్పారు. పరిశుభ్రత, పచ్చదనానికి పెద్ద పీట వేస్తూ పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, వైస్ ఎంపీపీ స్వప్న, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, ఎంపీడీఓ బన్సీలాల్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నీలం మధు ముదిరాజ్, ఉపేందర్, బాలమణి శ్రీశైలం, సుధీర్ రెడ్డి, సువర్ణ మాణిక్ రెడ్డి, కావ్య కాశిరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని హెచ్‌యంటీ హిల్స్ కమ్యూనిటీ హాలులో మంగళవారం పోలీస్ అధికారులు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కేపీహెచ్‌బీ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ చంద్రశేఖర్, సిఐ కిషన్‌కుమార్, ఎస్ఐ రాజేందర్, వినయ్‌కుమార్, రామ్‌మోహన్‌రెడ్డి, మౌనిక రెడ్డిలతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్పొరేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని మతాల వారు సోదరులుగా మెలగాలన్నారు.

సమస్యలతో ప్రజలు సతమతం

ఆల్విన్‌కాలనీ: గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఆదిత్యనగర్, వెంకటపాపయ్యనగర్, ఉజ్జయిని మహంకాళినగర్, తంగరాజుబస్తీ, చంద్రమ్మ బస్తీ, పంచమి బస్తీ, పాపమ్మ బస్తీ, ఫోర్ట్ ఎస్టేట్ ప్రాంతాల్లో బీజేపీ నాయకులు రవికుమార్ యాదవ్ పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై అధికార పార్టీ నాయకులు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డ్రైనేజి, మంచినీరు, రోడ్లు, వీధిలైట్లు,పింఛన్, రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూంలు అందక శేరిలింగంపల్లి ప్రజలు ఇబ్బందిపడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్లూరి రామరాజు, నరేందర్‌రెడ్డి, కుమార్ యాదవ్, రవీంద్రరావు, కమలాకర్‌రెడ్డి, రఘు, రాజు, రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న రవికుమార్‌యాదవ్

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పటాన్‌చెరు టౌన్: మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు.రంజాన్‌మాసం కావడంతో మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్‌కాలనీలో అబూబకర్ మసీదులో మైనార్టీలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఉన్నతికి కృషి చేస్తోందని తెలిపారు.

ఘనంగా సాంస్కృతికోత్సవం

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం సాంస్కృతికోత్సవం 'సిన్టిలేషన్స్' ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు కోటి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే సహనం, శ్రమ, అంకిత భావం ఎంతో అవసరమన్నారు. కోటి తాను స్వరపరిచిన కొన్ని పాటలను పాడి విద్యార్థులను ఉత్రూతలూగించారు. కాలేజీలోని సంగీతానికి సంబంధించిన 'క్రెసెండో' విద్యార్థి కూటమి సభ్యులతో ముచ్చటించారు. చలనచిత్ర నటుడు వంశీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకుండా తమకు నచ్చిన రంగంలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు

పటాన్‌చెరు టౌన్: గ్రూపు మహిళలకు స్వయంఉపాధికి కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బండ్లగూడలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్ర స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గ్రూపు మహిళలకు స్వయం ఉపాధి కోసం 20 కుట్టు మిషన్లను అందజేసి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రశేఖర్, గొల్ల కృష్ణయాదవ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పటాన్‌చెరు టౌన్: పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం విద్యాశాఖ అధికారులు తనిఖీచేశారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఫాదర్ స్కూల్ ఎస్టీ జోసెఫ్ హైస్కూల్, శ్రీ చైతన్య హైస్కూల్, రామచంద్రాపురం పరిధిలోని ఎస్ఎస్‌సీ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ జ్యోతి విద్యాలయం, జెడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్‌లను డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఎస్‌సీఆర్టీ రాధారాణి, జిల్లా విద్యాధికారి విజయ, ఎంఈఓ పీపీ రాథోడ్, ఏర్పాట్లను పరిశీలించారు.

ఆర్థికసాయం అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భారతమ్మకు ఎన్ఎంఆర్ యువసేన నాయకులు మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువసేన నాయకులు రవిచారి, మధు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న భారతమ్మకు మందుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. గతంలో ఆమెకు పింఛన్ వచ్చేదని, కొంతకాలంగా నిలిపివేసినట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

గచ్చిబౌలి: వేసవికాలం బాటసారుల దాహార్తిని తీర్చేందుకు శేరిలింగంపల్లి, కొండాపూర్‌లో మంగళవారం చలివేంద్రాలను ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని రాఘవేంద్రకాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజుశెట్టి, ఆంజనేయులు, రాములుగౌడ్, కిషన్‌జీ, అమర్‌నాథ్‌యాదవ్,కుమార్‌సాగర్, శ్రీకాంత్‌నాయక్, ఉదయ్‌సాగర్, ప్రవీణ జీవన్, బన్ను తదితరులు పాల్గొన్నారు.